క్లుప్తంగా

ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

జడ్చర్ల టౌన్: సంచారజాతులలో ఒకరైన ఫకీ ర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని... ఫకీర్‌హక్కుల సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జహంగీర్ శుక్రవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఫకీర్‌లు నేటికి చాలా మంది భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. ఆదుకోవాలని విన్నవించారు.

సమస్యలు పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ఎస్సీ సంక్షేమ హాస్టల్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంక్షేమశాఖ అధికారి పాండుకు ఎంఎస్‌ఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు సుధాకర్, రాము, సాంబ, శివ పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి గడ్డపాటి విజయరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో కెమిస్ట్ డ్రగిస్ట్ భవన్‌లో శుక్రవారం ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జిల్లాస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న గడ్డపాటి విజయరాజు మాట్లాడుతూ దళితులు క్రైస్తవం స్వీకరించినప్పుడు వారికి ఎస్సీ హోదా దక్కడం లేదన్నారు. దళితులకు ఎస్సీ హోదా కల్పించాలని దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని చేసి హక్కును సాధించుకుంటామని అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శామ్యూల్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాబర్ట్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శిగా కె.విజయభాస్కర్, కోశాధికారిగా ఎం.విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శిగా జీవన్‌కుమార్, ఈసీ సభ్యులుగా దత్తు, రెవరెండ్ వంశీధర్, మీడియా ఇన్‌చార్జిగా ఎ.శ్రీధర్‌లను ఎన్నుకున్నారు.

వాటర్ ట్యాంకు అందజేత



దేవరకద్ర: గద్దెగూడెం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్ ట్యాంకును అందజేశారు. లయన్స్ క్లబ్ రిజినల్ చైర్మన్ గాజుల శ్రీనివాసులు తన సొంత ఖర్చుతో వెయ్యిలీటర్ల వాటర్ ట్యాంకును అందించినట్లు వివరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి, లయన్స్ సమన్వయ కర్త అశ్విని చంద్రశేఖర్, లయన్ శ్రీహరి, లయన్ గిరి ప్రసాద్‌రెడ్డి, గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

మహబూబ్‌నగర్ రూరల్: కోయిలకొండ మండలం కొత్తపల్లి గ్రామంలో దళిత శివస్వాములను ఆలయంలోకి రానివ్వకుండా.. తాళం వేయడంతో పాటు కులం పేరుతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యంరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఏఓ శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా శివమాల వేసిన మాల రాజు, బ్యాగరి రాములు, చిన్న రాములు, బ్యాగరి దాసు, మాల అంజనేయులు, రాములు ఈనెల 1న అంజనేయస్వామి ఆలయంలోని శివాలయం దగ్గరకు ఇరుముడి విడవడానికి వెళ్లారన్నారు. కాగా అదే గ్రామానికి చెందిన కొందరు ఆలయంలోనికి రానివ్వకుండా అవమానించారని తెలిపారు. కేసు నమోదు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు సత్యం తదితరులు పాల్గొన్నారు.

అల్లాహు...అక్బర్

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంటుంది. రంజాన్ తొలి శుక్రవారం మసీదులన్నీ ముస్లింలతో కిటకిటలాడాయి. మహబూబ్‌నగర్‌తోపాటు జిల్లాలోని పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరులు సామూహికంగా భక్తిశ్రద్ధలతో జుమా నమాజు చేశారు. శుక్రవారం నమాజులతో మసీదుల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మసీదుల ఆవరణలో ఇత్తరు, మిస్వాక్, టోపీలు, ధార్మిక పుస్తకాల స్టాల్లు వెలిశాయి.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మజీదులో శుక్రవారం సాయంత్రం సంకలమద్ది(బంగ్లగడ్డ)కి చెందిన దేవరకొండ కృష్ణయ్య ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఖాజామైనోద్దీన్, అబ్దుల్ ఖాదర్, టైలర్ కలీం, అబ్దుల్లా, జమీర్, సలాం, మన్సూర్, హైమద్, ఆబిద్, సలీం తదితరులు పాల్గొన్నారు.



పర్యవేక్షణ కరువు!



ఎంపీడీఓ కార్యాలయం



మల్కపూర్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్

- వివిధ కారణాలతో చుట్టపు చూపుగా వస్తున్న స్పెషల్ అధికారులు
- సమస్యల వలయంలో చిక్కుతున్న పల్లెలు
- వేధిస్తున్న తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఇబ్బందులు

నవాబుపేట: గ్రామాల్లో పలు సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్యం వంటివి నిత్యం వేధిస్తున్నాయి. గ్రామాలకు ప్రత్యేక అధికారులను కేటాయించిన ప్రభుత్వం వారు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశాలు ఇచ్చింది. కాగా ఆయా గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు వివిధ శాఖలకు చెందిన వారు కావటంతో.. వారి శాఖపరమైన విధులు సైతం అతిముఖ్యం కావటంతో ఇబ్బందుల తప్పడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు బాధ్యతలు తీసుకున్న అధికారులు తప్పనిసరి పరిస్థితిలో తమకు వీలున్నపుడు గ్రామాలకు వస్తుపోతున్నారు. దీంతో తాజాగా గ్రామాల్లో ఉత్పన్నం అవుతున్న తాగునీటి ఎద్దడి, పారిశుద్ధ్య సమస్యలతో పాటు అభయహస్తం లబ్ధిదారుల పరిశీలనతో, పన్నుల వసూలు వంటి వాటి విషయంలో ఇబ్బందులు తలెత్తున్నాయి. మండలంలో స్పెషల్ అధికారులకు ఒక్కక్కరికి మూడు గ్రామాలు కేటాయించారు. మొత్తం 54 గ్రామాలకు 18 మందికి బాధ్యతలు అప్పగించారు. కానీ వారు తమ శాఖాపరమైన పనులు చూసుకుని గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడక తప్పడం లేదు. దీంతో గ్రామాల్లో సమస్యలపై నిత్యం వారి పర్యవేక్షణ ఉండడం లేదు. ఇప్పటికే మండలంలో వివిధ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. సమయానికి నీళ్లు అందడం లేదని స్థానికులు వాపోతున్నారు. రెండు, మూడు రోజులు సైతం ఒక్కోసారి ఎదురుచూడాల్సి వస్తోందని చెబుతున్నారు. సమస్యల పరిష్కారానికి కృషిచేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

పర్యవేక్షణ ఇబ్బందిగా ఉంది

మూడు గ్రామాలకు ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించారు. పైగా ఇరిగేషన్ విధులు నిర్వహిస్తున్న తరుణంలో.. తాజాగా వేసవి సమస్యలు అదనంగా ఉన్నాయి. దీంతో ఇటు తాగునీటి ఎద్దడి సమస్యలు, అటు గ్రామాల పర్యవేక్షణ ఇబ్బందిగా ఉంది. అయినా సమస్యలు పరిష్కరించడానికి కృషిచేస్తున్నాం.

– సమీయుల్లా, ఇరిగేషన్ ఏఈ

ఆదేశాలు పాటించాల్సిందే

గ్రామాలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు తమ విధులు కచ్చితంగా నిర్వహించాల్సిందే. తమ శాఖ విధులతో పాటు గ్రామాలను సందర్శించాలి. గ్రామ సమస్యలు పరిష్కరించాలి. తాగునీటి ఎద్దడిపై పూర్తిగా సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత స్పెషల్ అధికారులదే.

– శ్రీనివాస్, ఇన్‌చార్జ్‌ఎంపీడీఓ

డిగ్రీ కళాశాలలో హక్కుల దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ డిజిటల్ యుగంలో కొనుగోలు, అమ్మకాలపై వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వినియోగదారుడు తమ హక్కులను తెలుసుకుని, ప్రశ్నించే ధోరణి అలవర్చుకోవాలన్నారు. సమాచార కేంద్రం కన్వీనర్ బాల్‌లింగయ్య, నాగలక్ష్మి, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: వినియోగదారుడు వస్తువు కొనుగోలు చేసినపుడు తప్పనిసరిగా రశీదు పొందాలని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ అన్నారు. శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని కళాశాల సమావేశ మందిరంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. డిపార్ట్‌మెంట్ హెడ్ మంజుల, కోఆర్డినేటర్ రవీందర్ రావు, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కామర్స్ అధ్యాపకులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి

నవాబుపేట: బట్టోనిపల్లితండాలో ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి ప్రత్యేక నిధుల ద్వార సీసీ రోడ్డు వేసినట్లు మాజీ సర్పంచ్ మాణ్యానాయక్ తెలిపారు. శుక్రవారం గ్రామంలో ప్రధాన రోడ్డులో దాదాపు రూ. 10 లక్షల రూపాయల విలువైన నిధులతో సీసీ రోడ్డు పూర్తి చేసినట్లు ఆయన వివరించారు. ఎంపీటీసీ తులసీరాంనాయక్, వాసుయాదవ్, నర్సింహాచారీ, ఖాజా, కృష్ణయ్య, సంతోష్, భగవాన్, మల్లేష్ తదితరులు ఉన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి

జడ్చర్ల టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ వైద్య విధాన పరిషత్ జాయింట్ సెక్రటరి శ్రీదేవికి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహ తదితరులు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రి ఏజెన్సీ కాంట్రాక్టర్ల అవినీతి అక్రమాలపై విచారణ చేసి గుర్తింపు రద్దుచేయాలని వినతిపత్రంలో పొందుపర్చారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు

మహమ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు మండల అధ్యక్షుడు కేఎం నారాయణ తెలిపారు. శుక్రవారం గాధిర్యాల్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీటీసీ కోట్ల రాములమ్మ, చెంద్రయ్య, కేశవులు, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించండి

దేవరకద్ర: మోడల్ స్కూల్స్, ఎస్‌ఎస్‌ఏ, కేజీబీవీ ఉద్యోగులకు జనవరి, ఫిబ్రవరి వేతనాలు వెంటనే చెల్లించాలని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణరావును కలిసి విన్నవించారు. మోడల్ స్కూల్స్‌లో పని చేస్తున్న టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్స్‌లకు ఫిబ్రవరి నెలకు సంబంధించిన వేతనాలను, హెచ్‌బీటీ ఉపాధ్యాయుల జనవరి వేతనాలను, ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులకు, కేజీబీవీ ఉద్యోగులకు ఫిబ్రవరి వేతనాలు అందలేదని వివరించారు. స్పందించిన ముఖ్య కార్యదర్శి మూడు రోజుల్లో వేతనాలు అందేలా చుస్తామని హామీ ఇచ్చినట్లు హర్షవర్ధన్‌రెడ్డి తెలిపారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

దేవరకద్ర: గోపన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ప్రముఖులు సురేందర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం అబ్దుల్‌హక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులైన చిన్నారులు



హన్వాడ: దొర్రితండా ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. చిన్నారులు ఒకరోజు ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలు బోధించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ రాజు నాయక్ హాజరయ్యారు. హెచ్‌ఎం పుల్లయ్య, ఉపాధ్యాయుడు మల్లేష్, పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లిలో శ్వేతావిద్యామందిర్ పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుహార, చైర్మెన్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



దేవరకద్ర: కౌకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం చలివేంద్రంను విద్యుత్ ఏడీ సంతోష్ కుమార్ ప్రారంభించారు. బాటసారులకు, ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఏడీ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లైన్‌మెన్లు, ఆపరేటర్లు నరసింహులు, రాము రవి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఖలీల్, సంతోష్, శ్రీశైలం, సాయి, సురేష్, ధర్మయ్య, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు పూజలు



దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం ప్రత్యేక అలంకరణ చేసి పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించిన అనంతరం అమ్మవారి పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ద్రోహం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాజకీయ పార్టీలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని బీసీలకు కేటాయించకుండా క్షమించరాని ద్రోహం చేశాయని ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కోట్లకిషోర్ అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా జరుగుతున్న అన్యాయం పునరావృతం అయ్యిందన్నారు. ఎన్నికల్లో సమాధానం చెబుతామని హెచ్చరించారు. త్వరలో బీసీ సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమష్టిగా నిర్ణయం తీసుకుంటామన్నారు. బీసీ అభ్యర్థిని ఎంపీ బరిలో నిలుపుతామని తెలిపారు. యువత అధ్యక్షుడు శివప్రసాద్‌యాదవ్, విజయ్, చంద్ర, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

కాన్షీరాం జయంతి

మహబూబ్‌నగర్ రూరల్: కాన్షీరాం జయంతిని శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాతపాలమూరు జైభీమ్ చౌరస్తాలో బహుజన మహనీయుల శోభయాత్ర కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాయికంటి రాందాస్ మాట్లాడుతూ కాన్షీరాం అంబేడ్కర్ రాసిన కుల నిర్మూలన గ్రంథాన్ని చదివి.. అగ్రకుల ఆధిపత్యం జీర్ణించుకోలేక కుటుంబాన్ని, ఉద్యోగాన్ని సైతం వదులుకొని బడుగుల రాజ్యాధికారం లక్ష్యంగా ఉద్యమించారని గుర్తుచేశారు. కమిటీ కన్వీనర్ పాతూరి రమేష్, నాయకులు సింగిరెడ్డి పరమేశ్వర్, రాజగాని అశోక్, దినేష్, మనోహర్, మోహన్, ధన్‌రాజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

గండేడ్: గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణకు గానూ..ఉమ్మడి గండేడ్ మండలానికి రూ. 66 లక్షలు కేటాయించినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాధవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలాల వారీగా అధికారుల నివేదిక ఆధారంగా నిధులు కేటాయించామన్నారు. అత్యవసరం ఉన్న చోట వినియోగించాలన్నారు. ఇంకా ఎక్కడెక్కడ అవసరముందో గుర్తిస్తే నిధులు కేటాయించేలా చేస్తామన్నారు. పరిగి డిపోకు కొత్తగా 17 బస్సులు మంజూరు అయ్యాయని.. ఎక్కడెక్కడ బస్సులు అవసరమో గుర్తించి ఆయా రూట్లలో నడిపించేందుకు కృషిచేస్తామన్నారు. దీంతో పాటు మహిళల సంఘాలకు రూ. పది లక్షల చొప్పున వడ్డీ లేని రుణం అందిస్తామన్నారు. గతంలో రుణం పొంది సక్రమంగా కట్టని వారిని కూడా.. కట్టించి ప్రభుత్వం నుంచి వచ్చే లబ్ధిని అందరికి అందేలా చేయాలని అన్నారు. గృహజ్యోతి ద్వారా నియోజకవర్గంలో 70 శాతం మందికి మేలు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చిందన్నారు. ఎంపీపీ మాధవి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ దేవన్న, సూపరింటెండెంట్ ప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వెంటనే అప్‌లోడ్ చేయించుకోవాలి

గండేడ్: గృహజ్యోతి పథకం కింద మిస్సయిన వారు వెంటనే తిరిగి అప్‌లోడ్ చేయించుకోవాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి మండలంలో చాలామంది పేర్లు గృహజ్యోతికి నమోదు కాలేదని వెంటనే స్పందించాలని అన్నారు. మొత్తం 11,709 మంది వినియోగదారులు ఉన్నారని తెలిపారు. వీరిలో 10,074 మంది ఆధార్ రేషన్ కార్డులు సేకరించగా 7,890 పథకానికి అర్హులయ్యారని వివరించారు. మిగిలిన వారు అప్‌లోడ్ చేయించుకోవాల్సి ఉందన్నారు.

వాల్మీకి బోయల సంక్షేమానికి తోడ్పడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వాల్మీకి బోయల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు కేటాయించి తోడ్పడాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కురుమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. వాల్మీకి బోయలను ఎస్టీ పునరుద్ధరణ జాబితాలో చేర్పించాలన్నారు. గత ప్రభుత్వం పదేళ్లుగా మోసం చేసిందన్నారు. ఏ పార్టీ కూడా ఎంపీ సీటు కేటాయించలేదన్నారు. జిల్లా కోశాధికారి సతీష్‌కుమార్, యువసేన అధ్యక్షుడు దుర్గప్రసాద్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



భూత్పూర్ పాఠశాలలో ఎంఈఓ విచారణ

సాక్షి ఎఫెక్ట్..

భూత్పూర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాధికారి నాగయ్య విచారణ చేపట్టారు. పాఠశాలలో హెచ్‌ఎం రూ.500 ఇస్తేనే టెన్త్ హాల్ టికెట్ ఇస్తున్నారని సాక్షిలో కథనం రావడంతో స్పందించారు. పాఠశాలకు వెళ్లి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కాగా హెచ్‌ఎం డబ్బులు అడిగిన విషయం వాస్తమేనని వారు ఎంఈఓతో వాపోయారు. వారి నుంచి రాతపూర్వక ఫిర్యాదు అందుకున్నారు. విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తానని ఎంఈఓ 'సాక్షి'కి తెలిపారు.



విద్యార్థులతో వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ నాగయ్య

నవీన్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నవీన్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్నాసాగర్‌లో స్వగృహంలో జరిగిన దేవరకద్ర నియోజక వర్గ స్థాయి వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అదేవిధంగా త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్, ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, వివిధ మండలాలకు చెందిన ఎంపీపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవలు చేయాలి

నవాబుపేట: విద్యార్థి దశ నుంచే సేవా కార్యక్రమాలు అలవచ్చుకోవాలని మండల వైద్యాధికారి నవీన్‌చంద్ర తెలిపారు. శుక్రవారం తీగలపల్లిలో కొనసాగుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల శిబిరాన్ని సందర్శించి సూచనలు చేశారు. మాజీ సర్పంచ్‌లు చెన్నయ్య, బాలకిష్టయ్య, నారాయణ ఉన్నారు.



సమావేశానికి తరలిరండి



మాట్లాడుతున్న జేఎన్ దేవదానం

చిన్నచింతకుంట: మండలకేంద్రంలో శనివారం నిర్వహించే బీడీకార్మికుల సమావేశానికి అధిక సంఖ్యలో తరలి రావాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేఎన్ దేవదానం పిలుపునిచ్చారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరి యాజయాన్యం కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తుందన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలకు నోటీసులు ఇస్తామన్నారు. నాయకులు కోళ్ల వెంకటన్న, చంద్రన్న, సర్దార్, చంద్రశేఖర్‌లతో పాటు పలువురు ఉన్నారు.

జడ్చర్లలో పోషణ పక్షోత్సవాలు



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని బాలానగర్ 1 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. అయిదు కేంద్రాలకు సంబంధించి ఒకేచోట జరిపిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ, వార్డు కౌన్సిలర్ ఆలూరి శశికిరణ్ హాజరయ్యారు. అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ పత్రిష్ఠ



నవాబుపేట: జంగమయ్యపల్లిలో నూతన దేవాలయం ప్రారంభంతో పాటు ద్వజస్తంభం, నూతన విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా రెండు రోజులుగా ప్రత్యేక పూజలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం హనుమాన్ దేవాలయం వద్ద మహా యజ్ఞం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. నూతన విగ్రహాలను జలదివాసం చేసి శనివారం ప్రతిష్ఠించనున్నారు.

నాటిన మొక్కలను కాపాడాలి



నవాబుపేట: హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఇప్పటూర్ ప్రాథమిక పాఠశాలలో మొక్కలకు నీరుపోశారు. అధికారులు ఆయ గ్రామాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. పంచాయతీ అధికారి కల్పన, నర్సింహులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ ఉద్యోగులను కాపాడుకుంటాం

స్టేషన్ మహబూబ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యుత్ ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్మిక భవన్‌లో శుక్రవారం తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల యూనియన్-327 (ఐఎన్‌టీయూసీ) మహబూబ్‌నగర్ జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఐఎన్‌టీయూసీ అనుబంధమైన 327 విద్యుత్ యూనియన్ బలోపేతం కోసం పాటుపడుతున్న వారందరిని అభినందిస్తున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములు యాదవ్, ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాబ్యానాయక్, కార్యదర్శి కేఎల్.శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షులు సాయిబాబా, ఉదయ్‌కుమార్, బల్‌రాం, జగదీష్‌గౌడ్, శ్రీనివాస్ రావు, రవికుమార్, మహమూద్, రోజారాణి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



వంశీచంద్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యుత్ ఉద్యోగుల యూనియన్ సభ్యులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com